నిజరూప దర్శనంలో జోగులాంబ



ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు ,ఎమ్మెల్సీ చల్లా (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

అలంపూర్, ఫిబ్రవరి 3 : అమ్మలగన్న అమ్మ జగజ్జనని పాహిమాం.. పాహిమాం.. అంటూ భక్తులు దైవ చింతనలో డోలలాడుతూ భక్తి పారవశ్యంతో జోగుళాంబ దేవీని ఆరాధించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తి పీఠమైన జోగుళాంబ అమ్మవారు సోమవారం వసంత పంచమి సందర్భంగా భక్తులకు నిజరూప దర్శనభాగ్యం కల్పించారు. ఐదురోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో పరిసమాప్తి అయ్యాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ ఉంచొద్దు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి 3 : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 28 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డబుల్‌బెడ్రూం ఇండ్ల జాబితా గల్లంతు చేశారని దానిపై విచారణ చేసి లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా చూడాలని లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డిపి ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరిగితే డిపి తగిలిన వారి పేర్లు జాబితాలో లేకుండా ఇతరుల పేర్లు జాబితాలో ఉన్నాయని వాటిపై పూర్తి స్థాయి విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాలి

అయిజ, ఫిబ్రవరి 3 : అయిజ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవడంతోపాటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాఠశాల యజమానిపై ఆయన ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు కల్పించాల్సి మౌలిక వసతులు కల్పించడం లేదని కలెక్టర్‌కు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాధవ్, నరేశ్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం

గద్వాలటౌన్, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడి దారులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఆరోపించారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రజా కార్మిక వ్యతిరేకంగా ఉందన్నారు. పేద, మధ్యతరగతి ఆకాంక్షకు దూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ వ్యవహరిస్తుందని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల కృష్ణ, ఆంజనేయులు, తిరుపతన్న, రామకృష్ణ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దమందడి, ఫిబ్రవరి 3 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సద్గుణ అన్నారు. మండలంలోని దొడగుంటపల్లి, అంకాయపల్లితండాలో సోమవారం పర్యటించి బోరు మోటర్లను పరిశీలించారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను పరిశీలించి తాగునీటి ఎద్దడి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్, పంచాయతీ కార్యదర్శులు సుచిత్ర, వెంకటేశ్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. జిల్లాలోని నలు మూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. భూ ఫిర్యాదులు 1, పరస్పర గొడవల ఫిర్యాదులు 9, భార్యాభర్తల ఫిర్యాదులు 1 మొత్తం 11 ఫిర్యాదులు అందాయని ఎస్పీ చెప్పారు.

పీహెచ్‌సీ వద్ద క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 3 : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద సోమవారం జిల్లా లీగల్ సెల్ అధికారి, సివిల్ జడ్జి రజని, జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో శ్రీనివాసులు ఆయా రకాల క్యాన్సర్ వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కృష్ణకుమారి, డాక్టర్ జాన్సీ, డాక్టర్ మంజుల, డాక్టర్ చాంద్ పాషా, సీహెచ్‌వో సిద్ధిగౌడ్, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు, క్యాన్సర్ నిర్ధారణ సిబ్బంది, ఆశలు, ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 3 : ఫిబ్రవరి 10న నిర్వహించే జాతీయ నులిపురు గుల నివారణ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఫిబ్రవరి 10 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురు గుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని , 1 నుంచి 19 ఏండ్ల వయస్సు గల ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు తినిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఫిబ్రవరి 10న అటెండెన్స్ సమయంలోనే విద్యార్థులకు మాత్రలు తినిపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారులకు సూచించారు. అవసరమైన మాత్రలు అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 10న మాత్రలు వేసుకోకపోతే అలాంటి వారికి ఫిబ్రవరి 11 నుంచి 17వ తేదీ వరకు గుర్తించి మాత్రలు తినిపించాలని ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సాయినాథ్‌రెడ్డి, పరిమళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 32 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డైనేజీలు, సీసీరోడ్లు నిర్మించాలి

గోపాల్‌పేట, ఫిబ్రవరి 3 : డైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతూ మండలంలోని బుద్దారం గ్రామ బలరాంరెడ్డి కాలనీవాసులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశారు. చాలా కాలంగా కాలనీలో డైనేజీలు, సీసీ రోడ్లు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు, డైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో శ్రావణ్‌కుమార్, కొమురయ్య, నర్సింహ, రాములు, బొక్కలయ్య, తిరుపతయ్య, సురేశ్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా పశుబల ప్రదర్శన పోటీలు ప్రారంభం

అయిజ, ఫిబ్రవరి 3 : మండలంలోని ఉత్తనూర్‌లో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అంతర్రాష్ట్ర పశుబల ప్రదర్శన పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ పోటీలను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. దివంగత నేత తిరుమల్‌రెడ్డి రైతు సంబురాల్లో భాగంగా అఖిల భారత ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలో అఖిల భారత ఒంగోలు గోజాతి పోషక, ప్రోత్సాహక సంక్షేమ సమితి ద్వారా పశుబల ప్రదర్శన పోటీలు నిర్వహణకు తిరుమల్‌రెడ్డి ఎనలేని కృషి చేశాడన్నారు. ప్రస్తుతం తిరుమల్‌రెడ్డి మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, ఆకాంక్షల మేరకు పోటీలు కొనసాగిస్తామన్నారు. అనంతరం ఉత్తనూర్ గ్రామంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో దివంగత నేత పులకుర్తి తిరుమల్‌రెడ్డి చిత్రపటానికి చిన్నారెడ్డి, రైతులు నివాళులర్పించారు. నాలుగు పళ్ల విభాగం పోటీలకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన 27 జతల వృషభరాజ ములు తరలివచ్చినట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

అంతర్రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీ షురూ..

మండలంలోని ఉత్తనూర్‌లోని ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీని సోమవారం చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నేత తిరుమల్‌రెడ్డికి బాస్కెట్‌బాల్ క్రీడపై ఉన్న అభిమానంతోనే

ఉత్తనూర్‌లో బాస్కెట్‌బాల్ టోర్నీలో తలపడిన జట్లు

అయిజ : ఉత్తనూర్‌లో పశుబల ప్రదర్శనలో పాల్గొన్న వృషభరాజములు

కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. టోర్నీకి 5 బాలికల జట్లు, 14 బాలుర జట్లు తరలివచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పులకుర్తి శ్రీనాథ్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, హెచ్‌ఎంలు తిమ్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ మేళా

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 3 : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపులు, ఇతర సమస్యల పరిష్కారానికి సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. రెవెన్యూ మేళా ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపులు, ఇతర సమస్యల పరిష్కారం పొందవచ్చని చెప్పారు. ఈ మేళా ద్వారా ప్రజలు ఎవరైనా రివిజన్ పిటిషన్స్ ఉంటే కూడా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. సోమ, గురువారాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాపర్టీ పేరు మార్పు , మ్యుటేషన్ సేవలు , ఇంటి నెంబర్ కేటాయింపు లేదా మార్పు వంటి మొదలైన సేవలు పొందవచ్చని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండాలి

గట్టు, ఫిబ్రవరి 3 : స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించే విధంగా సంసిద్ధులు కావాలని ఎంపీడీవో చెన్నయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో పీఎలకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు తుది జాబితా ఈనెల ఐదో తేదీన రానున్నదని స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మిగిలిపోయిన అర్హులకు కూడా గుర్తించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రవికుమార్ పాల్గొన్నారు.

పుల్లూరులో మెరిసిన అణిముత్యం

పతకంతో దివితేశ్ దీపక్

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 3 : గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు మధురైలో నిర్వహించిన జాతీయ స్థాయిలో స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పుల్లూరు గ్రామానికి చెందిన కరణం దివితేశ్ దీపక్ రెండు కాంస్య పతకాలు, ఒక రజిత పతకం సాధించారని తల్లిదండ్రులు కరణం చంద్ర మోహన్‌రావు, కవిత తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థిని, వారి తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

గద్వాల రూరల్, ఫిబ్రవరి 3 : జములమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయ పరిసరాల ప్రాంతాల్లో సోమవారం మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగించవద్దనే స్టిక్కర్లను దుకాణాలకు అతికించారు. కార్యక్రమంలో ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, సీవో నిజా మబ్దీన్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఆత్మకూరు ఎస్సై వాకిటి నరేందర్ అన్నారు. మండలంలోని తిప్పడంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటువల్ల ఎన్నో నేర పరిశోధనలు సులువుగా పరిష్కరించవచ్చన్నారు. ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానంగా పేర్కొన్నారు. గ్రామ ప్రధాన రహదారి, కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. దీంతో గ్రామస్తులు అప్పటికప్పుడు రూ. 30వేలు విరాళాలు సేకరించి ఎస్సైకి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 3 : వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేస్తున్నారని ఎస్పీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 8 ఫిర్యాదు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, గద్వాల సీఐ శ్రీను ఉన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

అయిజ, ఫిబ్రవరి 3 : అయిజ మండలం విస్తీర్ణంగా పెద్దదిగా ఉండడంతో ఒకే పోలీస్ స్టేషన్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అయిజ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మేడికొండలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్పీ శ్రీనివాసరావుకు గ్రామస్తులు ఈశ్వర్, కృష్ణ గౌడ్ కోరారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎస్పీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాల్యాయి లక్ష్మీనారాయణ, బుచ్చన్న, రఘు పాల్గొన్నారు.

ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మేడికొండ గ్రామస్తులు

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఐఈవో అంజయ్య

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 3 : జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలో 92శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ జిల్లా విద్యాధికారి అంజయ్య తెలిపారు. జనరల్ విభాగంలో 579మంది విద్యార్థులకు గానూ 567మంది హాజరు కాగా 12మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 819మంది విద్యార్థులకు గాను 721మంది హాజరు కాగా 98మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం 1,398మందికి గానూ 1,288 మంది విద్యార్థులు హాజరుకాగా 110మంది గైర్హాజరైనట్లు ఆయన చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలో జనరల్ విభాగంలో 368మంది విద్యార్థులకు గానూ 360 మంది హాజరు కాగా 8మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 708మంది విద్యార్థులకు గానూ 682మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1,076 మందికి గానూ 1042మంది హాజరు కాగా 34మంది గైర్హాజరైనట్లు ఆయన చెప్పారు.

కాగా సోమవారం కేజీబీవీ వనపర్తి, బాలికల జూనియర్ కళాశాల, స్కాలర్స్, రాహుస్, సీవీ రామన్ కళాశాలల పరీక్షా కేంద్రాలను డీఐఈవో తనిఖీ చేశారు.

ఎస్సీలుగా గుర్తించాలి

మద్దికల్, ఫిబ్రవరి 3 : విద్యా హక్కు చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మాదాసి కురువ, మాదరి కురువలను బీసీగా గుర్తిస్తున్నందున తమ కులానికి పూర్తిగా అన్యాయం చేస్తుందని మా కులాన్ని ఎస్సీలుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట మాదాసి కురువ సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలుపురు మాట్లాడుతూ 2024కులగణన నిర్వహించగా అధికారులకు కురువ కులం బదులు మాదాసి కురువ, మదారి కురువ అని రాయించామన్నారు. అయితే మండలంలోని రెవెన్యూ అధికారులు మాత్రం బీసీ-బీ సీరియల్ నెంబర్ 11 అని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. దీని వల్ల మా పిల్లలు విద్యలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కులాన్ని ఎస్సీ కులంగా భావించి సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, రామకృష్ణ, తిరుమలేశ్, సవారన్న, బజారన్న, రంగస్వామి, కర్రెప్ప, నర్సింహులులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం గేటు ఎదుట నిరసన చేస్తున్న మాదాసి,మాదారి కురువలు

మాదిగల సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

వనపర్తిలో మాట్లాడుతున్న గద్వాల కృష్ణ

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 3 : ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న మాదిగల సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గద్వాల కృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్ష డప్పులు-వేల గొంతులు ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం టీఎన్జీవో భవనంలో మాదిగ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ డప్పును సంకనవేసుకొని తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య, సువార్తమ్మ, సివిల్ కుమార్, గట్టయ్య, వెంకటస్వామి, బచ్చలకూర పరమేశ్, చంద్రశేఖర్, బలరాం తదితరులు ఉన్నారు.

దండుగా తరలుదాం

ధరూరు, ఫిబ్రవరి 3 : ఎస్సీ వర్గీకరణ అమలు సాధన కోసం తలపెట్టిన 'లక్ష డప్పులు- వెయ్యి గొంతులు' కార్యక్రమానికి గ్రామంలోని ప్రతి మాదిగ డప్పుతో దండుగా కదలాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్నపాడు ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద లక్ష డప్పులు-వెయ్యి గొంతుల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో దండోరా కళాకారులు వెంకటస్వామి, చరణ్, ఆంజనేయులు, రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు అబ్రహం, గోవిందు, బుజ్జన్న, పాంటన్న పాల్గొన్నారు.

భక్తుల నిలువుదోపిడీ

రెట్టింపు ధరలకు పూజాసామగ్రి విక్రయం

ఇటిక్యాల, ఫిబ్రవరి 3 : బీచుపల్లి క్షేత్రంలోని లక్ష్మీహయగ్రీవ జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంతపంచమి రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు భక్తులు ఆసక్తి చూపిస్తుంటారు .ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న పూజా సామగ్రి దుకాణదారుడు రెట్టింపు ధరలకు సామగ్రి అమ్ముతూ భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నాడు. పూజకు అవసరమయ్యే పసుపు, కుంకుమ, తేనే, సెంటుసీసా, బలపం, టెంకాయ, పండ్లు, పూలు, పెన్నులు, పెన్సిల్, గాజులు, ఆకులు, చక్కెర, వక్కలు, ఖర్జూరాలు, పచ్చిటెంకాయ, కొబ్బరి, అగరుబత్తీలు, గంధం, టవల్లు, రెండుకేజీల బియ్యం (నాసిరకం)తదితర పూజా సామాగ్రిని గతేడాది రూ.500 లకు అమ్మగా ఈ ఏడాది రూ.1200 వరకు విక్రయిస్తున్నాడు. సోమవారం మొత్తం 368 మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. ఇంత దోపిడీ జరుగుతున్నా ఆలయకమిటీ సభ్యులు పట్టించుకోకపోవడం విశేషం. ఈ దోపిడీపై ఆలయ కమిటీ సభ్యులను వివరణ కోరగా ఈవిషయం మాదృష్టికి వచ్చింది ఇప్పటి వరకు మా న్యువల్‌గా దుకాణం అమ్మడానికి అనుమతులు ఇచ్చాం. వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి టెండర్ రూపంలో దుకాణం అమ్మడానికి అనుమతిస్తామన్నారు. ఈ విషయంపై మేనేజర్ సురేందర్‌రాజు మాట్లాడుతూ తాను సోషల్ మీడియాలో పూజా సామగ్రి ధరల వివరాలను పోస్ట్ చేసినందుగానూ దుకాణదారుడు నా వ్యాపారం దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నావ్ అంటూ గొడవకు దిగాడన్నారు. ఆలయ కమిటీ నిర్ణయం మేరకే తాను విధులు నిర్వర్తిస్తానని మేనేజర్ తెలిపారు. ఆలయ కమిటీ ఆదేశాలను కూడా సదరు దుకాణదారుడు బేఖాతరు చేస్తున్నాడని మేనేజర్ తెలిపాడు. నిత్యం వేలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండే ధరలకు విక్రయించేలా ఆలయ కమిటీవారు చర్యలు చేపట్టాలని వారు భక్తులు కోరుతున్నారు.

రూ. 1,60,727 రికవ